సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 14, మే, 2025



సోమశిలలో 48.744 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 48.744 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 5730, ఉత్తర,దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.97,600
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,851
3శాతం జీఎస్టీతో	రూ.9,117
నవర (8గ్రా)	రూ.72,936

గరిష్టం/కనిష్టం
40.5 /29.8

వాతావరణం

వాతావరణం జిల్లాలో బుధవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 50 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 422 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 422 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షలకు 386 మంది, మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షకు 36 మంది గైర్హాజరయ్యారు.

19న దగదర్తి ఉపాధ్యక్ష ఎన్నిక

నెల్లూరు (పొగతోట): దగదర్తి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక ప్రత్యేక సమావేశం ఈనెల 19వ తేదీన ఉదయం 11 గంటలకు దగదర్తి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీలోపు మండల ప్రజా పరిషత్ సభ్యులకు ప్రత్యేక సమావేశానికి సంబంధించిన నోటీసులు జారీ చేయాల్సి ఉందన్నారు. పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సీబీఎస్ఈ ఫలితాలు విడుదల

నెల్లూరు (టౌన్): సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పది, 12 తరగతుల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా నిర్వహించారు. సీబీఎస్ఈ పరీక్షలకు సంబంధించి జిల్లాలో పదవ తరగతికి 1,370 మంది, 12వ తరగతికి 412 మంది కలిపి మొత్తం 1,782 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 19 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఫలితాల్లో పదవ తరగతికి సంబంధించి 98 శాతం, 12కు సంబంధించి 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సీబీఎస్ఈ పాఠశాలల యాజమాన్యం తెలిపింది.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తి

- జిల్లాలో మొత్తం 3,221 స్కూళ్లు

నెల్లూరు (టౌన్): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తయింది. మొత్తం 3,221 పాఠశాలలుగా విద్యాశాఖ అధికారులు తేల్చారు. శాటిలైట్ స్కూల్స్-0, ఫౌండేషన్ స్కూల్స్ -968, బేసిక్ ప్రైమరీ స్కూల్స్ -1,187, మోడల్ ప్రైమరీ స్కూల్స్ -594, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ -79, హైస్కూల్స్ -288, హైస్కూల్ ప్లస్ బీపీఎస్ -74, హైస్కూల్ ప్లస్ ఎంపీఎస్ - 31గా తేల్చారు. అయితే జీరో ఎన్‌రోల్‌మెంట్‌ను శాటిలైట్ స్కూల్స్‌గా పరిగణించారు. జిల్లాలో అలాంటి స్కూల్స్ ఒకటి కూడా లేదు.

17న హీట్ ద బీట్

- కలెక్టర్ ఆనంద్ వెల్లడి

నెల్లూరు రూరల్: ప్రతి నెలా 3వ శనివారం జరిగే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ శనివారం (17వ తేదీన) బీట్ ద హీట్ కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భవనాలపైన రూఫ్ టాప్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రముఖ రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్స్ ఏర్పాటు చేసుకోవాలని, బిల్డింగ్‌పై చల్లదనానికి కూల్ వైట్ పెయింటింగ్ చేసుకోవాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడంతో ఉష్ణోగ్రతను తగ్గించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.


ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

నెల్లూరు (పొగతోట): డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో పదవ తరగతి చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు లెదర్, స్టిచ్చింగ్, కటింగ్‌లపై శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18-35 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించి శిక్షణ పూర్తి అయిన అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో డీఆర్‌డీఏ కార్యాలయంలోని జాబ్స్ విభాగంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం 0861-2321261, 9032693233 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఊరూరా మద్యం

వీధికో బెల్టు షాపు

- తాగుడుకు బానిసలవుతున్న ప్రజలు
- ఇల్లు, ఒళ్లు గుల్లచేసుకుంటున్న వైనం
- కుటుంబాల్లో తరచూ గొడవలు
- హత్యలకూ వెనుకాడని మద్యం ప్రియులు
- మహిళల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం
- తాజాగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్లపై మహిళల కన్నెర్ర
- మద్యంతో కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆవేదన





నెల్లూరు వేదాయపాళెం ప్రాంతంలో బెల్టు దుకాణం వద్ద మంగళవారం మద్యం తాగుతూ..

ఇలాంటి ఘటనలు ఎన్నో..

- నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన నాగరాజు, సురేఖలు దంపతులు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో నాగరాజు మద్యానికి బానిసయ్యాడు. దీంతో దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. పలుమార్లు సురేఖ భర్తను మద్యం మానివేయమని ప్రాధేయపడింది. ఆయన ససేమిరా అనడంతో ఆత్మహత్య చేసుకుంది. భార్య మృతిని జీర్ణించుకోలేని నాగరాజు కూడా అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. పచ్చని సంసారంలో మద్యం రేపిన చిచ్చు వారి జీవితాలను అర్ధాంతరంగా ముగిసేలా చేసింది.
- మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని తాతను మనుమడు హత్యచేసిన ఘటన బుజబుజ నెల్లూరులో చోటుచేసుకుంది.
- సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగొద్దన్నందుకు ఓ వృద్ధుడిని ఇద్దరు యువకులు దారుణంగా హత్యచేశారు.
- బుజబుజనెల్లూరులో మద్యం మత్తులో విజయ్ అనే వ్యక్తి ఓ మహిళను హత్యచేశాడు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అలా..

పచ్చని కుటుంబాల్లో చిచ్చురేపుతున్న మద్యాన్ని ప్రజలకు దూరంగా ఉంచాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆలోచించింది. అందుకు తగ్గట్టుగానే జనావాసాలకు దూరంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే వాటిని నిర్వహించింది. నిర్ణీత వేళల్లోనే మద్యం విక్రయాలు సాగించేలా చేయడంతో పాటు గ్రామాల్లో బెల్టుషాపుల ఊసేలేకుండా చేసింది. నాటుసారాపై ఉక్కుపాదం మోపింది. దీంతో మహిళల్లో ఆనందం వెల్లివిరిసింది.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇలా..

గతేడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో జిల్లాలో 200 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఇందులో అగ్రభాగం దుకాణాలు కూటమి నేతలు, వారి అనుచరులే దక్కించుకున్నారు. ఇంకేముంది నిబంధనలకు నీళ్లొదిలారు. రెండువేలకుపైగా బెల్టు దుకాణాలను ఏర్పాటుచేసి 24గంటలూ అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

సాక్షిప్రతినిధి, నెల్లూరు: టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఊరూరా మద్యం ఏరులై ప్రవహిస్తుండటంతో పచ్చని సంసారాల్లో చిచ్చురేగుతోంది. మద్యం మత్తుకు బానిసై తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కుటుంబ సభ్యులనే హతమారుస్తున్నారు. బెల్టుపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. తాజాగా మహిళల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. తమ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలను తొలగించాలని ఆందోళనకు దిగుతున్నారు. బెల్టుషాపుల వల్ల తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయని వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. అందులో భాగంగా ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లిలో శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌ను మహిళలు చుట్టుముట్టి బెల్టుషాపులను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంపద సృష్టిస్తామని ఎన్నికల ముందు పదేపదే చెప్పిన కూటమి నేతలు ఈ తరహాలో జనం జేబుల్లో నుంచి సొమ్ము గుంజుకుంటూ ఖజానాను నింపుకుంటున్నారు.

బార్ల వద్దే సిట్టింగ్ రూమ్‌లు

మద్యం పాలసీ నిబంధనల మేరకు సిట్టింగ్ రూమ్‌లకు అనుమతులు లేవు. దుకాణంలో మద్యం కొనుగోలు చేసి తమవెంట తీసుకెళ్లాలే తప్ప అక్కడ తాగడానికి వీలులేదు. అలా చేస్తే వ్యాపారం సాగదని భావించిన వ్యాపారులు నిబంధనలను తోసేసి మినీబార్లను తలపించేలా సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మందుబాబులు అక్కడే మద్యం సేవిస్తున్నారు.



నెల్లూరు మైపాడు గేటు ప్రాంతంలోని ఓ బెల్టు దుకాణం వద్ద మంగళవారం ఇదీ పరిస్థితి

4 నెలల్లో రూ.489 కోట్ల మద్యం తాగేశారు

ఈఏడాది జనవరి మొదలు ఏప్రిల్ మాసాంతం వరకు జిల్లాలో మద్యం ప్రియులు అక్షరాలా రూ.489 కోట్ల మద్యం తాగేశారు. దీనిని బట్టి చూస్తే రోజుకు సగటున రూ.4 కోట్ల మేర మద్యం తాగేశారని అర్థమవుతోంది.

ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్

మద్యాన్ని ఒక్క రూపాయి ఎక్కువ ధరకు అమ్మినా ఉపేక్షించేది లేదు. అలాగే బెల్టుషాపులకు మద్యం విక్రయించే దుకాణాలకు మొదటి తప్పు కింద రూ.5 లక్షలు, అదే తప్పు పదేపదే చేస్తూ ఉంటే లైసెన్సు రద్దుచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. వాటిని అమలు చేయాల్సిన ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారు. అడపాదడపా మాత్రమే దాడులు చేస్తున్నారు. బెల్టు షాపునకు సరఫరా చేసిన సీసాలపై లేబళ్లు లేవని, ఏ మద్యం దుకాణానికి సంబంధించినదో తెలియడం లేదని చెబుతూ అధికారులు కేవలం బెల్టు నిర్వాహకులపై కేసులు నమోదుతో సరిపెడుతున్నారు.



రెండు వేలకు పైగా బెల్టుషాపులు

జిల్లాలో 200 మద్యం దుకాణాలు, 55 బార్‌లు ఉండగా వాటికి పదింతలుగా 2వేలకు పైగా బెల్టుషాపులు వెలిశాయి. బెల్టు వ్యాపారం మూడు క్వార్టర్లు, ఆరు బీర్లు అన్న చందంగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్టుషాపుల నిర్వహణ నేరం. అయితే మద్యం వ్యాపారం అధికారపార్టీకి చెందిన వారి చేతుల్లోకి వెళ్లడంతో పట్టణాలు, గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేశారు. నేరుగా మద్యం దుకాణాల నుంచే వాటికి మద్యం సరఫరా అవుతోంది. గతంలో మద్యం షాపుల్లో కేవలం కొన్ని రకాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అన్ని రకాల బ్రాండ్లు, బీర్లూ అందుబాటులో ఉన్నాయి. క్వార్టర్, బీరుపై అదనంగా రూ.50 వరకు మందుబాబుల నుంచి వసూలు చేస్తున్నారు. కూటమి సర్కార్ మద్యాన్ని మందుబాబుల చెంతకు చేర్చి వారిని మద్యానికి బానిసలుగా మార్చి ఇళ్లు, ఒళ్లు గుల్లచేస్తోంది.





పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు

వైభవం.. తెప్పోత్సవం

- పుష్కరిణిలో నరసింహుని విహారం
- ముగిసిన పెంచలకోన బ్రహ్మోత్సవాలు

రాపూరు: పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం రాత్రి శోభాయమానంగా అలంకరించిన తెప్పపై పెనుశిల నరసింహస్వామి ఉభయనాంచారులతో కలసి కొలువుతీరి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చారు. నరసింహస్వామి వారి ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి తెప్పోత్సవం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు స్వామి వారిని అశ్వవాహనంపై ఉంచి కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

అంతకుముందు ఉదయం శ్రీవారి చక్రస్నానం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు, సుదర్శన చక్రం విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య పుష్కరిణిలో స్వామివారి చక్రతల్వార్ (సుదర్శన చక్రం)ను పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు.

వైభవంగా వసంతోత్సవాలు

పెంచలకోనలో స్వామి వారికి వసంతోత్సవాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్లకు వసంతాలు చల్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కనులపండువగా రథోత్సవం

నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రథోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. నేత్రపర్వంగా తీర్చిదిద్దిన రథంపై స్వామివారు సర్వాలంకారశోభితంగా కొలువై భక్తులను కటాక్షించారు. విశేష పూజా కార్యక్రమాలను అర్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ పర్యవేక్షణలో జరిపారు. కొబ్బరికాయలు, గుమ్మడికాయలను భక్తులు కొట్టి కర్పూర హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల మీదుగా రథోత్సవం దాదాపు నాలుగు గంటల పాటు సాగింది. భక్తులకు మజ్జిగ, పానకం, శీతల పానీయాలు, పులిహోర తదితరాలను అందజేశారు. ఉభయకర్తలుగా ముంగమూరు కృష్ణచైతన్యరెడ్డి, శ్వేత, పత్తి జయరామయ్యనాయుడు, పద్మావతి దంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామకృష్ణ, ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.



రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం. (ఇన్‌సెట్‌లో) విశేషాలంకారంలో దేవదేవేరులు

బుచ్చి టీడీపీ నాయకుల్లో అసంతృప్తి

- ఎమ్మెల్యే కార్యక్రమాలకు డుమ్మా
- కనీసం ఆహ్వానం లేదని ఆవేదన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని టీడీపీ నాయకుల్లో రోజురోజుకు అసంతృప్తి పెరుగుతోంది. మండలంలో పార్టీ ముఖ్య నాయకులైన సూరా శ్రీనివాసులురెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వారి అనుచరులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కార్యక్రమాలకు దూరంగా ఉండటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. రూరల్ నాయకుడు బత్తల హరికృష్ణ తప్ప పార్టీ కార్యక్రమాల్లో ఎవరూ కనిపించడం లేదు. ఇటీవల జరిగిన కార్యక్రమాలే ఇందుకు నిదర్శనం. మూడురోజుల క్రితం పంచేడులో జరిగిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ భూమిపూజ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డి హాజరు కాలేదు. మునులపూడి పంచాయతీ రెడ్డిపాళెంలో జరిగిన సీసీరోడ్ల ప్రారంభోత్సవం, సోమవారం పట్టణంలోని ఓ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాలో కూడా సూరా, యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి హాజరు కాలేదు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా అంతంతమాత్రంగా హాజరయ్యారు.

కనీస సమాచారం ఇవ్వడం లేదు

ఎమ్మెల్యే కార్యక్రమాలకు తమకు కనీస సమాచారం అందడం లేదని, కూరలో కరవేపాకులా తమను చూస్తున్నారని సదరు నాయకులు అంటున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు సదరు నాయకులకు కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్ని కార్యక్రమాలకు ముందస్తు సమాచారం అందించేవారు. సీనియర్ నాయకులను ఎంతో గౌరవించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని టీడీపీ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ మారి పొరపాటు చేశామా అనే ఆలోచనలో ఉన్నారు. ఇదిలా ఉండగా ఇతర మండలాలకు చెందిన కొందరు నాయకులు బుచ్చిలో జరిగే ఎమ్మెల్యే కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరవుతుండటం గమనార్హం. ఇతర మండల నాయకులకు ఇచ్చే గౌరవం, సమాచారం కూడా తమకు ఇవ్వడం లేదని లోలోపల తమ్ముళ్లు మదన పడుతున్నారు. అయితే రూరల్‌లో జరిగే కార్యక్రమాలకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తంచనుగా హాజరవుతున్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం



ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, ఎన్‌ఎంయూ నాయకులు

- ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు
- ఆ సంఘం ఆధ్వర్యంలో పీటీఓ కార్యాలయం ముట్టడి

నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను త్వరితంగా పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరు నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండు వద్ద ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రజా రవాణా అధికారి కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. అనంతరం ఆర్టీసీ ప్రాంగణంలో కార్మికులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమంలో భాగంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై అనేక సార్లు విన్నవించుకున్నామని, అయినప్పటికీ సమస్యలు పరిష్కరించకుండా పోరాటం చేస్తున్న కార్మికులు, నాయకులపై వేధిపులకు పాల్పడుతోందన్నారు. సర్క్యులర్ 1-2013 ఉద్యోగ భద్రతను వెంటనే అమలు చేయాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలని, అక్రమ సస్పెన్సన్‌లు, రీమూవల్స్‌ను నిలుపుచేయాలని కోరారు. ఈహెచ్‌ఎస్ కార్డు బదులుగా పాత వైద్య విధానాన్ని కొనసాగించాలన్నారు. మహిళలకు పిల్లల సంరక్షణ సెలవులు తప్పనిసరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చెంచయ్య, జిల్లా అడ్వైజర్ జె వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్లయ్య, మాధవరావు, పద్మారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

- మహిళ కడుపులో నుంచి 9 కిలోల గడ్డ తొలగింపు



ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ల బృందం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి (జీజీహెచ్)లో ఒక మహిళకు అరుదైన ఆపరేషన్ చేసి ఆమె కడుపులో నుంచి 9 కిలోల గడ్డను తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాలక్ష్మి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. స్థానిక పద్మావతి సెంటర్‌లో నివాసం ఉండే 46 ఏళ్ల విజయలక్ష్మికి కడుపులో గడ్డపెరుగుతూ వచ్చింది. కడుపు నొప్పిగా భావించి స్థానికంగా ఉండే నొప్పుల మాత్రలు మింగుతూ గడ్డను పెంచుకుంది. నొప్పి ఎక్కువ కావడంతో వారం క్రితం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. తాము అన్ని పరీక్షలతో పాటు ఎంఆర్ఐ చేశామన్నారు. కడుపులో గర్భసంచి వద్ద పెద్ద సైజులో గడ్డ ఉండటంతో ఆమెకు విషయం చెప్పామని, ఆలస్యం చేసి ఉంటే కేన్సర్‌గా మారే ప్రమాదం ఉందని తెలియజేశామన్నారు. ఆపరేషన్ చేసి 9 కిలోల గడ్డతో పాటు గర్భసంచిని తొలగించామని, బాధితురాలు కోలుకోవడంతో డిశ్చార్జి చేస్తున్నామని తెలిపారు. పెద్దాస్పత్రిలో ఆధునిక ఆపరేషన్ థియేటర్లతో పాటు అన్ని రకాల పరీక్షలున్నాయని, రూపాయి ఖర్చులేకుండా పెద్ద ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపరేషన్‌లో భాగస్వామ్యం అయిన అసోసియేట్ ప్రొఫెసర్ డా.సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హిమబిందు, అనస్థీషియన్ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతిశ్రీ, పలువురు నర్సింగ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

క్వారీ అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

సంగం: సంగం అరుంధతీయవాడ సమీపంలో కొండ ప్రాంతంలో క్వారీ అనుమతికి స్థానిక సచివాలయంలో మంగళవారం ఆర్డీఓ పావని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ముందుగా అధికారులు క్వారీ అనుమతులకు సంబంధించిన విధివిధానాలను ప్రజలకు వివరించారు. కొంత మంది క్వారీ కావాలని, పనులు దొరుకుతాయని తెలిపారు. మరికొందరు క్వారీ వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, ప్రాణనష్టం జరుగుతుందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అందరి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆర్డీఓ పావని మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. గ్రామానికి ఎటువంటి నష్టం జరగకుండా బాధ్యత తీసుకుంటామన్నారు. అనంతరం ఆర్డీఓ క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లానాయక్, సర్పంచ్ రమణమ్మ, సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.132
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.236
స్కిన్‌లెస్ చికెన్:	రూ.262
లేయర్ చికెన్:	రూ.187



పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి :	రూ.80
సన్నవి :	రూ.40
పండ్లు :	రూ.25



మృత్యువులోనూ వీడని బంధం

- గల్లంతైన అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం
- సంగం, కోవూరులో విషాదఛాయలు



కనిగిరి రిజర్వాయర్ పెద్దకాలువలో గాలిస్తున్న గజఈతగాళ్లు

సంగం: ఆ ఇద్దరే ఆ తల్లిదండ్రులకు బిడ్డలు. ఒక తల్లి కడుపున పుట్టారు. కలిసి పెరిగారు. కలిసి తిరిగారు. చివరికి కలిసి మరణించారు. ఒకరిని పిలిస్తే మరొకరు పలికే విధంగా ఆ ఇంట ఆనందాన్ని పంచిన ఆ ఇరువురు అన్నదమ్ములు కాలువలో పడి మృతి చెందిన హృదయవిదారక ఘటన కన్నీరు తెప్పిస్తోంది. సంగంలోని కనిగిరి రిజర్వాయర్ పెద్ద కాలువలో సోమవారం పడి గల్లంతైన ఇద్దరు అన్నదమ్ముల మృతదేహాలు మంగళవారం బయటపడ్డాయి. సంగం, కోవూరులో విషాదాన్ని నింపిన ఘటన వివరాల్లోకి వెళ్తే.. సంగంకు చెందిన దండె వెంకటరమణమ్మ చిన్న కుమార్తె శేషమ్మ, గోవిందయ్య దంపతుల ఇద్దరు కుమారులు బందా వెంకట చందు (15), వెంకట నందకిశోర్ (13) వేసవి సెలవుల కోసం అమ్మమ్మ ఇంటికి వచ్చారు. సోమవారం రోజులాగే కనిగిరి రిజర్వాయర్ పెద్దకాలువలో నీటి ప్రవాహ ఉధృతిని గమనించక దిగి గల్లంతైన విషయం తెలిసిందే. రాత్రి వరకు పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం ఉదయం నుంచి మళ్లీ గాలింపు చర్యలను ప్రారంభించారు. మృతదేహాలను వెలికి తీసేందుకు గజ ఈతగాడు వెంకటేశ్వర్లుతోపాటు మరికొందరు మత్స్యకారులు గాలించగా తొలుత వెంకటచందు మృతదేహం బయటపడగా, కొన్ని గంటల అనంతరం వెంకట నందకిషోర్ మృతదేహం బయట పడింది. గజ ఈతగాళ్ల చేతుల మీదుగా మృతదేహాలను తీసుకు వస్తుండగా ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా రోదనలతో నిండిపోయింది. ఆ ఇద్దరు చిన్నారులతో ఆనందంగా గడిపిన అమ్మమ్మ వెంకటరమణమ్మతోపాటు అపురూపంగా చూసుకుంటున్న తల్లిదండ్రులు శేషమ్మ, గోవిందయ్యలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. పోస్టుమార్టం అనంతరం చిన్నారుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటనందు మృతదేహాన్ని తీసుకొస్తున్న దృశ్యం



చిన్నారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

రెండు రోజుల్లో వస్తామని..

- కోవూరుకు చేరుకున్న అన్నదమ్ముల మృతదేహాలు

కోవూరు: వేసవి సెలవులకు అమ్మమ్మ ఊరు సంగం వెళ్లిన కోవూరుకు చెందిన శేషమ్మ, గోవిందయ్య దంపతుల ఇద్దరు కుమారులు బందా వెంకట చందు, వెంకట నందకిశోర్ అన్నదమ్ములు రెండు రోజుల్లో తిరిగి వస్తామని చెప్పి.. నిర్జీవంగా తిరిగి వచ్చారు. అక్కడ కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో నీటి ఉధృతిలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ ఇద్దరి మృతదేహాలు మంగళవారం బయట పడడంతో వెలికి తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో మృతదేహాలు కోవూరుకు తీసుకువచ్చారు. ఆ దంపతుల ఇద్దరు బిడ్డలు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్న దృశ్యాలు చూసిన ప్రతి ఒక్కరు కంట తడి పెట్టుకుంటున్నారు. తల్లిదండ్రులిద్దరూ బేల్దారి పనులకు వెళ్లి కుమారులను కోవూరులోని ప్రభుత్వ పాఠశాలలో చదివించుకుంటున్నారు.

ప్రసన్న ప్రగాఢ సానుభూతి

సంగం వద్ద కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో నీటి ఉధృతిలో పడి బందా వెంకట చందు (15), వెంకట నందకిశోర్ (13) మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ధరల్లేక పొగాకు రైతు దిగాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సంఘాల నేతల డిమాండ్
- డీసీపల్లి కేంద్రంలో వేలం ప్రక్రియ పరిశీలన



పొగాకు వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

మర్రిపాడు: ఆరుగాలం శ్రమించి, రూ.లక్షలు వెచ్చించి పండించిన పొగాకుకు గిట్టుబాటు ధరల్లేక రైతులు దిగాలు పడుతున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే వారంతా తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని సీపీఎం, రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. డీసీపల్లిలోని పొగాకు బోర్డు వేలం కేంద్రంలో జరుగుతున్న వేలం ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. వేలంలో ప్రస్తుతం రైతులకు లభిస్తున్న ధరలపై వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్, రైతులతో మాట్లాడారు. అనంతరం వేలం కేంద్రం ఎదుట రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఉన్న ధరలు ఈ సంవత్సరం కూడా లభిస్తాయనే ఉద్దేశంతో రైతులు పొగాకు పంటను బాగా పండించారని తెలిపారు. వేలంలో ఒక్క కంపెనీ మాత్రమే కొనుగోలు చేస్తుందని, పూర్తి స్థాయిలో బయ్యర్లు రాకుంటే పొగాకుకు గిట్టుబాటు ధర లభించే అవకాశం లేదన్నారు. కిలోకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210 వస్తుందన్నారు. ఇలా అయితే పొగాకు సాగు చేసిన ప్రతి రైతు రూ.లక్షల్లో నష్టపోయే ప్రమాదముందన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొగాకు రేట్లు గణనీయంగా ఉన్నాయని, ధరలు లేని సమయంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయించి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి బయ్యర్లు వచ్చి కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర తప్పక లభిస్తుందని, కనీసం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయిస్తే రైతులకు ఆదరవుగా ఉంటుందన్నారు. ఆ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుని పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మూలి వెంగయ్య, రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి





వంశీకృష్ణ (ఫైల్) ఘటనా స్థలంలో పడి ఉన్న వంశీకృష్ణ

కొడవలూరు: బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నార్తురాజుపాళెం దిన్నె రోడ్డులో సోమ వారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. నార్తురాజుపాళానికి చెందిన గుండపనేని వంశీకృష్ణ (27) రామాపురం ఎన్టీఆర్ కాలనీలోని స్నేహితుడి వద్దకు సోమవారం సాయంత్రం బైక్‌పై వెళ్లారు. అక్కడ స్నేహితుడి వద్ద బాగా పొద్దుపోయే వరకు ఉండి అర్ధరాత్రి దాటాక బైక్‌పై తిరిగి ఇంటికి బయలుదేరారు. నార్తురాజుపాళెం ఫ్లై ఓవర్ వంతెన దాటుకొని కొంత దూరం వచ్చాక బైక్‌తో సహా రోడ్డుపై పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అందులో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. వంశీకృష్ణ బైక్ ముందు భాగం బాగా దెబ్బతిని ఉండడంతో ముందు వెళ్తున్న ఏదైనా గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. వంశీకృష్ణ అవివాహితుడు. ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిలో అవినీతి తోడేళ్లు

'ఆకులు నాకే వాడి మూతులు నాకుతున్నట్లు' సామెత చందాన కందుకూరులోని ఉపాధి హామీ పథకం వ్యవస్థ తయారైంది. ఉపాధి పనుల్లో రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడే కూలీలకు వచ్చే అరకొర వేతనంలో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు కమీషన్లు ఇవ్వాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఏలు) వారి కడుపులు కొడుతున్నారు. ఎవరి స్థాయిలో వారు టార్గెట్లు పెట్టి వారం వారం వేతనాల్లో కమీషన్లు వసూళ్లు చేసుకుంటున్నారు.

- కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు మామూళ్లు
- విజిట్‌కు వెళ్లే ఆ అధికారికి రూ.2 వేలు చేతిలో పెట్టాల్సిందే
- కూలీల కడుపులు కొట్టి కమీషన్లు కొట్టేస్తున్న ఎఫ్ఏలు



ఉపాధి పనులపై విజిట్‌కు వెళ్లి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ బాబురావు (ఫైల్)

కందుకూరు రూరల్: ఉపాధి పథకం అవినీతిమయంగా మారింది. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు మామూళ్ల వసూళ్లు మామూలుగా లేదు. గతంలో నిరుద్యోగ యువతి, యువకులు మాత్రమే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధుల్లో ఉండేవారు. ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వంలో ఆయా పార్టీ నాయకులే ఫీల్డ్ అసిస్టెట్లుగా మారారు. దొంగ మస్టర్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు.

కందుకూరు నియోజకవర్గంలో గుడ్లూరు మండలం కూలీల సంఖ్యలో టాప్‌లో ఉంది. కందుకూరు డ్వామా ఏపీడీ బాబూరావు కందుకూరు ఇన్‌చార్జి ఏపీఓగా కూడా వ్యవహరిస్తున్నాడు. అయితే ఏపీఓగా పనిచేస్తున్న సమీర్‌బాషా సెలవుపై వెళ్లడంతో పక్క మండల ఏపీఓకు ఇన్‌చార్జి ఇవ్వాల్సి ఉండగా ఏపీడీనే ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే సదరు ఏపీడీ మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా ఫీల్డ్ అసిస్టెంట్ రూ.2 వేలు చేతిలో పెట్టాల్సిందేనట. గుడ్లూరు మండలంలోని ఓ పంచాయతీలో రూ.2 వేలకు రూ.300 డబ్బులు తగ్గడంతో తీసుకోలేదట. క్యాష్ లేకపోతే ఫోన్‌పే చేయమని చెబుతున్నాడని ఆ శాఖలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్ల విధుల విషయంలో టార్గెట్లు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఆయనపై వస్తున్న ఫిర్యాదులపై కందుకూరు ఎమ్మెల్యే పలుమార్లు పిలిపించి మందలించినట్లు సమాచారం.

ఎడాపెడా మామూళ్లు

ఆ అధికారికి మామూళ్లు సమర్పించుకునే పేరుతో టీఏలు, ఈసీలు సైతం తమ జేబులు నింపుకునేందుకు ప్రతి కూలీ వద్ద వారానికి రూ.100 నుంచి రూ.200 వసూళ్లు చేస్తున్నారని సమాచారం. అయితే పంచాయతీని బట్టి మామూళ్ల రేటు పెరుగుతుందనే ప్రచారం ఉంది. కూలీ పనులకు రాని వారికి సైతం మస్టర్లు వేసి ఆ డబ్బులు ఫీల్డ్ అసిస్టెంట్ వసూలు జేబులో వేసుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తంతు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో జరుగుతోందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పంచాయతీలో కనీసం వందకు తగ్గకుండా దొంగ మస్టర్లు ఉంటున్నాయి.

అంతా ప్రహసనం

కందుకూరు నియోజకర్గంలో కందుకూరు, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు, వలేటివారిపాళెం మండలాలు ఉన్నాయి. గుడ్లూరు మండలం ఉపాధి కూలీల హాజరులో జిల్లాలోనే టాప్‌లో ఉంది. ఈ నెల 10వ తేదీ మస్టర్లు పరిశీలిస్తే.. గుడ్లూరులో 6,962 మంది కూలీలు హాజరయ్యారు. కందుకూరులో 5,610, వలేటివారిపాళెంలో 5,740, లింగసముద్రంలో 4,342, ఉలవపాడులో 3,920 మంది కూలీలు హాజరైనట్లు మస్టర్లు ఉన్నాయి. అయితే క్షేత్రస్థాయిలో తరచూ ఏపీడీ, ఏపీఓలు పనుల పరిశీలకు వెళ్లినప్పుడు కూలీల సంఖ్య, ఆన్‌లైన్‌లో కూలీల సంఖ్యను పరిశీలించి సంతకాలు చేసి రావాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. కందుకూరు ఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆయనకే ఇన్‌చార్జి ఏపీడీగా బాధ్యతలు ఇచ్చారు. ఆ ఇన్‌చార్జికే తిరిగి కందుకూరు ఏపీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు. ఇలా ఈసీలు, టీఏలను ఆయనకు నచ్చిన వారినే తెచ్చుకుంటున్నాడు.

గడ్డివాములు దగ్ధం

- రూ.2.40 లక్షల నష్టం

పొదలకూరు: మండలంలోని నేదురుమల్లిలో గడ్డివాములు మంగళవారం అగ్నికి ఆహుతి కాగా, సుమారు రూ.2.40 లక్షల నష్టం వాటిల్లింది. బాధిత ఉడతా ప్రసాద్ తన పాడిగేదెల కోసం 300 మోపులు గడ్డిని కొనుగోలు చేసి వాములను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఒక్కసారిగా గడ్డివాముల నుంచి పొగలు రావడంతో గుర్తించిన గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే మంటలు వ్యాపించడంతో పొదలకూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెళ్లి ఆర్పేలోగా వాములు అగ్నికి ఆహుతయ్యాయి.

ఇద్దరు యువకుల అరెస్ట్

- 6 కేజీల గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీధర్

నెల్లూరు (క్రైమ్): పూరి–తిరుపతి రైల్లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు యువకులను జీఆర్పీ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి వారి నుంచి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు రైళ్లల్లో మత్తు, మాదకద్రవ్యాల అక్రమరవాణా కట్టడికి పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఈ మేరకు రైల్వే సీఐ ఎ.సుధాకర్ తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కావలి, నెల్లూరు, గూడూరుల్లో ఒడిశా నుంచి బెంగళూరు, చెన్నై వైపు వెళ్లే రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో పూరి–తిరుపతి వెళ్లే రైల్లో తనిఖీలు చేపట్టగా కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన ముహమ్మద్ ఉబయ్ ఎస్‌పీపీ, కేరళ రాష్ట్రం ఎర్నాకులం పట్టణానికి చెందిన సాదిక్యూపీఏ అనే ఇద్దరు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.60 వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడించడంతో వారిని అరెస్ట్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసిన నెల్లూరు రైల్వే సీఐ ఎ.సుధాకర్, ఎస్ఐ ఎన్.హరిచందన, సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, మణికంఠలను డీఎస్పీ అభినందించారు.

కంటైనర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

కోవూరు: ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కోవూరు బైపాస్‌రోడ్డులోని సాయిబాబా మందిరం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు కొడవలూరు మండలం నాయుడుపాళెంకు చెందిన మదన్, కిశోర్ బైక్‌పై నెల్లూరుకు వస్తున్నారు. అదే సమయంలో ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న కంటైనర్‌ను అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రంగనాథ్‌గౌడ్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.